





రుద్రవరం వద్ద తుప్పు పట్టిన బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, శిథిలావస్థలో శ్లాబ్ లెవల్ గృహాలు

సొంతిల్లు కలేనా?

- శిథిలావస్థకు చేరుకుంటున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాలు
- ఐదేళ్లలో ఒక్క అడుగు ముందుకు వెయ్యని టిడ్కో గృహాలు
- జగన్ కక్షకట్టి టిడ్కో గృహాలను శిథిలావస్థకు చేర్చారు
- ఓటుతోనే బుద్ధి చెబుతామంటున్న లబ్ధిదారులు

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయి. కూలీ నాలీ చేసుకుని సొంత ఇంటి కోసం దాచిన నగదును గృహాల కోసం ఒక్కో లబ్ధిదారుడు లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. జగన్ ప్రభుత్వం టిడ్కో గృహాలను అభివృద్ధి పర్చకపోగా లబ్ధిదారులను నట్టేట ముంచారు. ఎన్నికల ప్రచారంలో టిడ్కో గృహాలను నిర్మించి ఒక్క రూపాయి లోను కూడా కట్టకుండా అందిస్తామని జగన్‌రెడ్డి హామీనిచ్చి గద్దెనెక్కిన ఐదేళ్లలో మాట మార్చి లబ్ధిదారులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపల్లె, ఏప్రిల్ 15: సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. ఆ కలను నిజం చేయటానికి గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అధికారులు దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎట్టికేలకు సొంత ఇల్లు పొందుతున్నామన్న ఆశతో లబ్ధిదారుల తమ వాటా నగదు చెల్లించారు. లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించటంతో పేదలు సంబరపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహనిర్మాణ పనులను పూర్తిగా ఆపేశారు. పురపాలక సంఘ ఎన్నికలకు 3 నెలల ముందు లబ్ధిదారులకు గృహాన్ని కేటాయించిన నియామక పత్రాన్ని హడావుడిగా అందించారు. రెండు నెలలుగా లబ్ధిదారులను కొత్తగా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్‌చేయాలని నెలనెలా ఆ బ్యాంక్‌లలో మీకు కేటాయించిన నగదును వాయిదాల పద్ధతిలో కట్టుకోవాలని పట్టణంలోని ఆర్‌పీ లు మున్సిపల్ అధికారులు ఆదేశిస్తున్నారు. లేకపోతే మీ గృహాన్ని కాన్సిల్ చేస్తామంటూ భయపెట్టారు.

1373 గృహాలు మంజూరు..

రేపల్లె మండలం అరవపల్లి పంచాయతీ శివారు గుంటూరువారి ఎస్సీ కాలనీ సమీపంలో పట్టణానికి చెందిన 2వ వార్డులో 11 ఎకరాల్లో భవన సముదాయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద గత ప్రభుత్వం గృహనిర్మాణాలకు స్థలాన్ని కేటాయించింది. నగర పంచాయతీలో 1373 పక్కా గృహాలు నిర్మాణానికి అనుమతిని అందజేసింది. అధికారులు ఇళ్ళులేని నిరుపేదలను గుర్తించి వారందరితో లబ్ధిదారుల వాటా నగదును విడతలవారీగా చెల్లించుకున్నారు. పేదలకు అందజేసే ఇళ్ళను స్థల విస్తీర్ణం ఆధారంగా 3 రకాలుగా విభజించారు. 300, 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో పడకగది ఇల్లు, 430 చ.అ విస్తీర్ణంలో రెండు పడకల గదుల ఇల్లు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 300 చ.అ విస్తీర్ణం ఇంటిదారులు ఒకేసారి తమ వాటాగా రూ.5వేలు చెల్లించాలి. 365చ.అ విస్తీర్ణం గృహానికి 4 విడతల్లో రూ.50 వేలు, 430 చ.అ విస్తీర్ణం ఇంటికి 4 విడతల్లో రూలక్ష చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే లబ్ధిదారులు రెండు కిస్తీలు చెక్కుల రూపంలో అప్పులు చేసి జమ చేశారు. ప్రస్తుతం పీఎంఏవై గృహాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవటంతో నూతన ప్రభుత్వం తమకు ఇళ్ళు ఎప్పుడు ఇస్తుందోనని కొందరు... అసలు ఇస్తుందో లేదోనని మరికొందరు మదన పడుతున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు...

గత ప్రభుత్వ హయాంలో పేదవానికి పక్కా గృహం నిర్మించాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌ల పనులు నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు అయినా టిడ్కో గృహాలను పట్టించుకోకపోవటంతో భవనాలు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గృహ సముదాయం అంతా నీటిలోనే ఉన్నాయి. బేస్ లెవల్‌లో ఉన్న అపార్ట్‌మెంట్ ఇనుప చువ్వలు, 3వ అంతస్తుపైన ఉన్న ఇనుప చువ్వలు తుప్పుపట్టి ఓ పక్కకు వంగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి.




భారీగా పెరిగిన పిచ్చిమొక్కలు

తాజాగా బాపట్లలో..

అంబేడ్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించే కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తన అనుచరులతో కలిసి సృష్టించిన హంగామా విమర్శల పాలైంది. బాపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మహనీయుడు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించి అక్కడే ఉన్న సమయంలోనే ఎమ్మెల్యే కోన రఘుపతి వైసీపీ శ్రేణులతో అక్కడకు దూసుకువచ్చారు. ఈ క్రమంలో టీడీపీ శ్రేణులను కవ్వించే చర్యలకు వైసీపీ పూనుకుంది. ఇదే కాకుండా వర్మ కంపెనీలపై కూడా ఎమ్మెల్యే కోన రఘుపతి ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు వక్రభాష్యం చెప్పే విధంగా విద్వేష వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

వైసీపీలో.. ఓటమి భయం



- వేగేశన నరేంద్రవర్మ కృష్ణప్రసాద్‌లను చుట్టుముట్టి తోసేస్తున్న వైసీపీ అల్లరిమూకలు (ఫైల్)

- రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్న అధికార పార్టీ అభ్యర్థులు
- కోడ్‌ను ధిక్కరించి మరీ విద్వేష పూరిత వ్యాఖ్యలు
- సంయమనం పాటిస్తున్న టీడీపీ అభ్యర్థులు
- మున్ముందు మరిన్ని కుట్రలకు తెరలేపే అవకాశం

బాపట్ల, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ఆశించిన స్థాయిలో ప్రజల్లో ఆదరణ కనబడకపోగా ఎక్కడకక్కడ నిలదీతలు ఎదురవుతున్నాయి. మరోవైపు ద్వితీయశ్రేణి నేతలంతా పార్టీని వీడుతున్నారు.. వలంటీర్లను పావులుగా చేసి ఎన్నికలు నిర్వహిద్దామనుకుంటూ వారికి నిజం నిలకడగా తెలియడం మొదలైంది.. ఇలా అన్ని దారులు మూసుకుపోతుండే సరికి దిక్కుతోచని స్థితిలో వైసీపీ అభ్యర్థులు అసహనంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో ఎన్నికల కోడ్‌ను ధిక్కరించి మరీ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం పట్ల ప్రజల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ వైసీపీ నేతలు ఇలాంటి విన్యాసాలను పూర్తిస్థాయిలో ప్రదర్శిస్తారనే అనుమానాన్ని టీడీపీ వ్యక్తం చేస్తోంది. పాలకపార్టీ కుట్ర రాజకీయాలను ముందే పసిగట్టిన టీడీపీ అభ్యర్థులు సంయమనం పాటిస్తూ ప్రచారంలో ముందుకుపోతున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఇతరత్రా కోడ్ ధిక్కరణలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజల్లో రోజురోజుకూ పాలకపార్టీపై ఉన్న భ్రమలు వీడిపోతుండడంతో ఎన్నికలు సమీపించే కొద్దీ వైసీపీ అభ్యర్థులు కుట్ర రాజకీయాలకు తెరతీసే అవకాశం లేకపోలేదని టీడీపీ పెద్దలు అభ్యర్థులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థులు చేస్తున్న విద్వేష వ్యాఖ్యలను సైతం ప్రజలకు అర్థమయ్యేలా చెబుతూ ప్రజాక్షేత్రంలోనే వారికి బుద్ధి చెప్పాలని అభ్యర్థులకు టీడీపీ దిశానిర్దేశం చేస్తోంది.

రెచ్చగొట్టే చర్యలు ఇలా...

అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి ఇటీవల మాట్లాడుతూ వలంటీర్లంతా వైసీపీ కార్యకర్తలేనని, రాజీనామాలు చేసి పార్టీ కోసం పనిచేస్తారని చేతనైంది చేసుకోండి అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఆ ఆదేశాలన ం దిక్క రిం చేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడడం ఆయనలో ఉన్న అసహనానికి నిదర్శనంగా కనబడుతోంది. ప్రవాస భారతీయులను ఉద్దేశించి వేమూరు వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు చేసిన వ్యాఖ్యలు అయితే వారిలో ఓటమి భయాన్ని ప్రస్ఫుటంగా కనిపించేలా చేశాయన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. విదేశాల్లో ఉండేవారు వైసీపీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకోబోమని, తిరిగి వారు విదేశాలకు వెళ్లకుండా చేస్తామనే వివాదస్పద వ్యాఖ్యలను ఆయన చేశారు. కేవలం సదరు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేశారనేది తేటతెల్లమవుతోంది.

టీడీపీ నేతలు సంయమనం పాటిస్తూ...

ప్రజల్లో వైసీపీ మీద గూడు కట్టుకున్న వ్యతిరేకత కళ్లముందు కనబడుతుండడంతో గెలుపు మీద ఆశలను వైసీపీ అభ్యర్థులు వదిలేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక దింపుడు కళ్లం ఆశలుగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, చర్యలు, కుట్ర రాజకీయాలను నమ్ముకున్నట్లు కనబడుతోంది. దానిలో భాగంగానే ఇలాంటి చర్యలకు వైసీపీ పాల్పడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, చర్యలు చేపట్టినా ఎక్కడా కూడా టీడీపీ అభ్యర్థులు సంయమనం కోల్పోకుండా పాలకపార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతూ ప్రచారం చేస్తుండడం గమనార్హం. బాపట్లలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం దగ్గర జరిగిన ఘటనలో టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పూర్తి సంయమనం పాటించడంతో పాటు శ్రేణులను కూడా నిలువరించగలిగారు. వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టాలని చూసినా ఎక్కడా ఆస్కారమివ్వకుండా అక్కడ నుంచి వెళ్లిపోవడంతో వైసీపీ ఎత్తుగడలు బెడిసికొట్టాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కోడ్ ఉల్లంఘనలపై చర్యలేవీ...

ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా కార్యక్రమాలు చేపట్టినా ఎన్నికల నియమావళి ప్రకారం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది. కానీ వైసీపీ అభ్యర్థులు ఇష్టారీతిన కోడ్ ధిక్కరణలకు పాల్పడుతున్నా చర్యలు లేవన్న విమర్శను టీడీపీ చేస్తోంది. ప్రవాస భారతీయులను బెదిరిస్తూ వేమూరు వైసీపీ అభ్యర్థి చేసిన వ్యాఖ్యలపై మాత్రం కేసు నమోదైనట్లు సమాచారం. అద్దంకి వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఏం చర్యలు తీసుకున్నారన్న దానికి అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. అదే విధంగా అంబేడ్కర్ జయంత్రి సందర్భంగా బాపట్లలో తలెత్తిన ఉద్రిక్తతలతో పాటు టీడీపీ అభ్యర్థి నరేంద్రవర్మ కంపెనీలపై ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన వ్యాఖ్యలను కూడా ఎన్నికల కమిషన్ పరిశీలించాలని టీడీపీ కోరుతోంది.

అభ్యర్థులను అప్రమత్తం చేసిన టీడీపీ

వైసీపీ ఓటమి భయంతో మున్ముందు మరిన్ని రాజకీయ కుట్రలకు తెగుబడే అవకాశం ఉందని మరింత అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అభ్యర్థులను పార్టీ పెద్దలు అలెర్ట్ చేశారు. వైసీపీ నేతలు చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఎప్పటికప్పుడూ ఈసీ దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ సూచించింది.

సంకీర్ణ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 15: సంకీర్ణ ప్రభుత్వంతోనే సంపూర్ణాభివృద్ధి సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం బాపట్ల మండలం నందిరాజుతోట, కొండుభొట్లపాలెం, పిన్నిబోయనవారిపాలెం, తోటవారిపాలెం, వల్లువారిపాలెం గ్రామాల్లో నరేంద్రవర్మ పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ నందిరాజుతోటలో సర్దార్‌గౌతులచ్చన్న పేరుతో కల్యాణ మండపం నిర్మిస్తానని హామీనిచ్చారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నూటికి నూరు శాతం కృషి చేస్తానన్నారు. ప్రజల మద్దతుతో వచ్చే ది ప్రజాప్రభుత్వమేనన్నారు. నియోజకవర్గ ప్రజలంతా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన నరేంద్రవర్మకు మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, సీనియర్ నాయకులు ఎండీ మొహిద్దీన్‌బేగ్, మరీదు వెంకటేశ్వరరావు, ఇనగంటి గాంధీ, కందుల బాలకోటేశ్వరరావు, కర్రి మీరయ్య, జంపని చలమయ్య, జంపని శివబాబు, తుళ్ళూరి భూశంకరరావు, పరిశా గోపి, ఉమ్మారెడ్డి వెంకటేష్, జి కె.నాయుడు, పల్లం సరోజనీ, శ్రీదేవి, దగ్గుమల్లి రాణి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, శ్యామల, చెన్నుపాటి హైమావతి, శివకుమారి, మార్పు ఆనందరావు, ప్రతాప్, రోశయ్య పాల్గొన్నారు.



బాపట్ల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, నాయకులు



వేగేశనకు హారతి ఇస్తున్న మహిళలు

పోలీసు సిబ్బందికి సహకరించాలి

- వెదుళ్ళపల్లి చెక్ పోస్ట్ వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ ఆకస్మిక తనిఖీలు

బాపట్ల, ఏప్రిల్ 15 : అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణా అరికట్టేందుకు వాహన తనిఖీలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు సిబ్బందికి తెలియజేశారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి చెక్‌పోస్ట్ వద్ద సోమవారం ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేశారు. స్వయంగా వాహనాల తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. పోలీసుసిబ్బందికి వాహనచోదకులు, ప్రజలు సహకరించాలని కోరారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవిధంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ప్రజలను ప్రలోభాలకు గురి చేయటానికి ఉపయోగించే నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమరవాణాను అరికట్టి ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటుహక్కును వినియోగించుకునేవిధంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దానికి అనుగుణంగా చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే పోలీసుసిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. 24గంటలు విధులు నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని పరిశీలించాలన్నారు. సరైన పత్రాలు లేకుండా 50వేలు కంటే ఎక్కువ నగదు ఎవరైన తరలిస్తూ ఉంటే వాటిని సీజ్ చేసి సంబంధితాధికారులకు అప్పజెప్పాలని సూచించారు. అక్రమంగా మద్యం, ప్రజలను ప్రలోభాలకు గురిచేయటానికి ఉపయోగించే వస్తువులు, బహుమతులు తరలిస్తుంటే వాటిని సీజ్ చేయాలన్నారు. నగదు, అక్రమ మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేసేటప్పుడు వీడియోగ్రఫి చేయించాలన్నారు. చెక్‌పోస్ట్‌లలో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డబ్బు, ఎక్కువ నగలు తీసుకెళ్ళవద్దని ఒకవేళ అత్యవసరమైన వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్ళిళ్ళు ఇతర అవసరాలకు పెద్దమొత్తంలో నగదు తీసుకెళ్ళాల్సి వస్తే వాటికి సంబంధించిన ఆధారాలు, ధ్రువీకరణపత్రాలను అధికారులకు చూపించాలన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో 12 చెక్‌పోస్ట్‌లలో సీసీ కెమెరాలు అమర్చటం జరిగిందన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ వివరాలు నమోదు చేయటం జరుగుతుందన్నారు. కావున ప్రజలు ఎన్నికల నియమావళి పాటిస్తూ వాహన తనిఖీలకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు.



చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేయిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పవన్‌పై రాయి కలకలం ఘటనలో.. పోలీసులు తర్జనభర్జనలు

తెనాలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి కార్యక్రమంలో ఓ యువకుడు రాయి విసిరాడంటూ వచ్చిన వార్తల కలకలం అంశంపై పోలీసులు తర్జనభర్జన పడుతున్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో పవన్‌కల్యాణ్ ర్యాలీ జరుగుతున్న సమయంలో ర్యాలీకి వచ్చిన యువతులకు ఓ యువకుడు తగలడం.. ఓ యువతి తండ్రి అతడిని నిలదీసే క్రమంలో పవన్‌పై రాయి విసిరారంటూ ఆ యువకుడిని పవన్ అభిమానులు పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే ఈ సంఘటనపై జనసేన వర్గాల నుంచి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ ఘటనకు సంబంధించి ఓ ముగింపు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ సంఘటనకు సంబంధించి యువకుడు కాని, యువతి తరుపున వారు గాని ఫిర్యాదు ఇచ్చేందుకు ఎవ్వరూ సుముఖంగా లేకపోవడంతో కొత్త చిక్కువచ్చిపడింది. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి సోమవారం వరకూ పోలీసులు అందుబాటులో ఉన్న సీసీ టీవి ఫుటేజ్‌లను, సంఘటన సమయంలో అక్కడ ఉన్న వారిని పలు దఫాలుగా విచారించారు. అయితే ఎక్కడా రాయి విసిరిన ఆరోపణ కాని చూసినట్టుగాని ఎవ్వరూ చెప్పలేదని యువతి తండ్రి కూడా పొరపాటున యువకుడు తగిలిన విషయంలోనే చిన్నపాటి ఘర్షణ జరిగిందే కాని రాయి విసరడం వంటి పరిస్థితులను తాము కూడా చూడలేదని చెప్పారు. అయితే రాత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చేందుకు మాత్రం ఇష్టపడలేదని డీఎస్పీ రమేష్‌బాబు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి ఏ ఫిర్యాదు లేకపోవడం వల్ల దీనిపై ఎట్లా ముందుకు వెళ్లాలనే విషయాన్ని న్యాయనిపుణులతో సంప్రదించి వారి సూచనల ప్రకారం నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

సమష్టి కృషితో ఎన్నికలను విజయవంతం చేద్దాం

రేపల్లె, ఏప్రిల్ 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని నిబంధనలను అతి క్రమిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. సోమవారం స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ బాధ్యతలను ఏవిధం గా వ్యవహరించాలనే విషయంపై అవగాహన కల్పించారు. అధికారులు సమష్టి కృషితో ఎన్నికలను విజయవంతం చేసే విధంగా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎన్నికల నియమావళిపై పీవోలు, ఏపీవోలకు అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలా సోరాన్, అధికారులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు మీచేతుల్లోనే..

చెరుకుపల్లి, ఏప్రిల్ 15: ఓటు హక్కు పొందిన యువత మే 13న జరిగే సాధారణ ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా కోరారు. సోమవారం చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని బూత్ నెంబర్ 231ను నమూనా పోలింగ్ కేంద్రంగా అధికారులు తీర్చిదిద్దారు. దీన్ని రిబ్బన్ కత్తిరించి ఆయన ప్రారంభించారు. ఈపోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సంతృప్తి చెందారు. నూతన ఓటుహక్కు పొంది న ఓటర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్‌ఐ మౌనిక, డివిజనల్ పంచాయతీ అధికారి తాతా శంకరరావు, కార్యదర్శి ఈవూరి విజయబాబు, వీఆర్‌వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పీవోలు ఏపీవోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

దిక్సూచి
DIKSUCHI

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే మానవాభివృద్ధి సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్), జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) సంయుక్తంగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక 2024ను తయారుచేసి ఇటీవల విడుదల చేశాయి. పోటీప రీక్షలకు తయారయ్యే విద్యార్థులు ఈ నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలించి దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికవేత్తలు, అర్థశాస్త్ర విద్యార్థులు ఈ నివేదికను చదవడం అవసరం. ఇతరులు కూడా నివేదికలోని ప్రధానాంశాలను పరిశీలించినా భారత ఆర్థికవ్యవస్థ, ఉద్యోగితా/ నిరుద్యోగం స్థితిపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉద్యోగితా స్థితికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక చలాంకాల ధోరణి ఈ మధ్య కాలంలో కిందివిధంగా ఉంది.

ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఎకానమీ

భారత శ్రామికశక్తి: పదిహేను సంవత్సరాలు, ఆపై వయసు ఉండి ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారు, ఉపాధి పొందుతున్న వారి మొత్తాన్ని శ్రామికశక్తి(లేబర్ ఫోర్స్)గా పరిగణిస్తారు.

శ్రామికశక్తి రేటు: మొత్తం జనాభాలో శ్రామికశక్తి శాతాన్ని శ్రామికశక్తి రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) అంటారు. 2024 ఉద్యోగితా నివేదిక ప్రకారం భారత దేశ శ్రామికశక్తి రేటు 2022లో 55.2 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు 59.8 శాతంగా ఉండటం గమనార్హం. అంటే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు కంటే మన దేశ శ్రామికశక్తి రేటు తక్కువగా ఉంది.

- అంతేకాకుండా కొంతకాలంగా భారత శ్రామికశక్తి రేటు తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. భారత శ్రామికశక్తి రేటు 2000లో 61.6 శాతం కాగా 2019 నాటికి 50.2 శాతానికి చేరింది. అయితే 2022 నాటికి తిరిగి అది 55.2 శాతానికి పెరిగింది. నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 39.63 కోట్లు ఉండగా 2019 నాటికి 49.55 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు పదికోట్లు(9.92 కోట్లు) పెరిగింది. ఇక 2022లో భారత శ్రామికశక్తి 56.74 కోట్లుగా ఉంది.

కార్మికశక్తి(వర్కింగ్ ఫోర్స్): ఏదేని ఆర్థిక కార్యక్రమంలో ఉపాధి పొందుతున్న వారిని కార్మికశక్తి అంటారు. మొత్తం జనాభాలో కార్మికశక్తి శాతాన్ని జనాభా కార్మికశక్తి నిష్పత్తిగా పిలుస్తారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారత కార్మికశక్తి నిష్పత్తి 2022లో 52.9 శాతంగా ఉంది. అయితే 2000లో ఇది 60.2 శాతంగా ఉండి 2019 నాటికి 47.3 శాతానికి తగ్గింది.

- నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 38.71 కోట్లు కాగా 2019లో 46.65 కోట్లు, ఇక 2022లో 54.45 కోట్లు.

నిరుద్యోగం రేటు: మొత్తం శ్రామికశక్తిలోని నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగరేటు అంటారు.

సాధారణ స్థితి నిరుద్యోగం

సర్వే సంబంధిత సంవత్సరకాలం(365 రోజులు)లో ఎక్కువ కాలం ఉపాధి దొరకని వారిని సాధారణ స్థితి నిరుద్యోగులు అంటారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారతదేశ సాధారణ స్థితి(యూజువల్ స్టేటస్) నిరుద్యోగం రేటు 2000లో 2.3 శాతం ఉండగా 2019 నాటికి 5.8 శాతానికి పెరిగింది. అయితే 2022 నాటికి తిరిగి 4.1 శాతానికి చేరింది. నిరపేక్షికంగా సాధారణ స్థితి నిరుద్యోగుల సంఖ్య 2000లో 9.2 మిలియన్లు ఉండగా 2019 నాటికి 29 మిలియన్లకు చేరింది. అయితే 2022లో అది 22.9 మిలియన్లుగా ఉంది.

- మొత్తంమీద శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి రేటు 2000 నుంచి 2019 సంవత్సరాల మధ్య తగ్గగా, 2019-2022ల మధ్య పెరిగాయి. ఇక నిరుద్యోగం రేటు 2000-2019 సంవత్సరాల మధ్య పెరగ్గా 2019-22 సంవత్సరాల మధ్య తగ్గింది. 2012 నుంచి 2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి పెరిగిన స్థాయిలో ఆర్థికవ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్తరించకపోవడం వల్ల నిరుద్యోగం రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది.
- అయితే 2019-2022 సంవత్సరాల మధ్య నిరుద్యోగం రేటు కొంత తగ్గినప్పటికీ ప్రపంచ ఆర్థిక మందగమనం దృష్ట్యా ఉద్యోగాల నాణ్యత, తక్కువ ప్రతిఫలంతో కూడిన ఉద్యోగిత గమనించదగ్గ అంశాలుగా నివేదిక చెప్పింది.

పురుషుల, స్త్రీల ఉద్యోగితా స్థితి

- 2022 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 77.2 శాతం ఉండగా, స్త్రీల శ్రామికశక్తి రేటు 32.8 శాతంగా ఉండటం గమనార్హం. ప్రపంచ సగటు మహిళా శ్రామికశక్తి రేటు 47.3 శాతం కాగా దక్షిణాసియా సగటు మహిళా శ్రామికశక్తి రేటు 24.8 శాతంగా ఉంది. 2000 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 83.6 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 38.9 శాతంగా, 2019లో పురుషుల శ్రామికశక్తి రేటు 75.5 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 24.5 శాతంగా ఉంది. కార్మికశక్తి నిరుద్యోగం రేట్లలో కూడా ఇదే ధోరణి ఉంది.

గ్రామీణ, పట్టణ ఉద్యోగితా స్థితి

- మొత్తంమీద పురుషులు, స్త్రీల విషయంలోనూ, గ్రామాలు, పట్టణాల్లో కూడా 2000-2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం తగ్గగా, నిరుద్యోగం రేటు పెరిగింది. 2019-22 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం పెరగ్గా నిరుద్యోగం రేటు తగ్గింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

ఐకార్ ఆలిండియా పీజీ, పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్



వ్యవసాయ సంబంధిత పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో నిర్దేశిత కోటా సీట్ల భర్తీకి ఉద్దేశించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)పీజీ 2024', ఐకార్ ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఫర్ డాక్టోరల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఐసీఈ- జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్-పీహెచ్‌డీ)2024'లకు నోటిఫికేషన్‌లు వెలువడ్డాయి. ఈ ఎగ్జామ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వీటిలో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ

విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రానమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/అగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

అర్హత: విభాగాన్ని అనుసరించి(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరికల్చర్/బయోటెక్నాలజీ/అగ్రిల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/వెటర్నరీ సైన్సెస్/కమ్యూనిటీ సైన్స్/హోమ్ సైన్స్/డెయిరీ); (బీఈ/బీటెక్)(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ ఇంజనీరింగ్/ఫిషరీ సైన్స్); బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.625

పీహెచ్‌డీ (జేఆర్‌ఎఫ్/ ఎస్ఆర్‌ఎఫ్)

స్పెషలైజేషన్‌లు: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్లాంట్ పాథాలజీ, నెమటాలజీ, ఎంటమాలజీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ ఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వెజిటబుల్ సైన్స్, ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్-స్పైసెస్- మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ పాథాలజీ, డెయిరీ కెమిస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో(జనరల్ నాలెడ్జ్/రీజనింగ్ ఎబిలిటీ)(అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీ, డెయిరీ, ఫిషరీస్, అలైడ్ సైన్సెస్) అంశాలనుంచి 20, రెండో పార్ట్‌లో కోర్ గ్రూప్ సబ్జెక్ట్ నుంచి 50, మూడో పార్ట్‌లో స్పెషలైజేషన్ సబ్జెక్ట్ నుంచి 50 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.975.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 11
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పరీక్షల తేదీ:** జూన్ 29న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/ICAR/

ఆంధ్ర వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ)- మూడేళ్ల బీబీఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ+ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లకు విశాఖ ఐఐఎం సహకారం అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి మూడేళ్ల తరవాత కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ డిగ్రీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీబీఏ+ఎంబీఏ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఫౌండేషన్ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, కేస్ స్టడీస్, విదేశీ ప్రొఫెసర్ల ఆన్‌లైన్ లెక్చర్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏటా కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- క్రియేటివిటీ, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్, టీంవర్క్, బిజినెస్ ఎథిక్స్, స్ట్రాటజిక్ అనాలిసిస్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- **స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ద్వితీయశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DiVzTTgలో చదవండి.

ఎడ్యు న్యూస్

'ఈజీ ఇంగ్లీష్' ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్- 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈజీ ఇంగ్లీష్' ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆఫర్ చేస్తోంది. ఇంగ్లీష్‌కు తోడు మోటివేషనల్ సెమినార్లు, వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా ఉంటాయి. మొత్తంమీద పది ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుంది. ఈ సంస్థ ఫౌండర్, చీఫ్ అయిన డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహణ ఉంటుంది. ఏప్రిల్ మూడో వారంలో కోర్సు ఆరంభమవుతుంది. కోర్సు కాలవ్యవధి మూడు వారాలు కాగా, ఈ నెల 21 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాలకోసం 9866006662 నెంబర్లో మాట్లాడవచ్చు.

హైదరాబాద్ ఐఐటీలో 'గ్రీన్కో' పీహెచ్‌డీ ఫెలోషిప్స్

హైదరాబాద్ ఐఐటిలోని గ్రీన్కో స్కూల్ ఆఫ్ సస్టయినబిలిటీ - పీహెచ్‌డీ ఫెలోషిప్స్‌ను ప్రకటించింది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫర్ నెట్ జీరో ట్రాన్సిషన్‌కు సపోర్ట్ చేసే పనిలో భాగంగా ఈ ఫెలోషిప్‌ను ఇస్తోంది. ఆరు గ్రీన్కో ఫెలోషిప్స్ ఉన్నాయి అలాగే మరో నాలుగు ఎంఓఈ ఫెలోషిప్స్ అయిదేళ్ళ కాలవ్యవధికి ఉన్నాయి. యూజీసీ - నెట్/ గేట్/ సీడ్/ సీఐఎస్ఆర్ టెస్టుని క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఎంఓఈ స్కాలర్‌షిప్స్ కోరే విద్యార్థులు ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎండిజైన్/ ఎం.ఆర్క్ పాసై ఉండాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.75,000 చొప్పున నాలుగేళ్ళ పాటు చెల్లిస్తారు. మూడు లక్షల మేరకు వార్షిక కంటింజెన్సీ ఫండ్ కూడా ఇస్తారు.

వెబ్‌సైట్: http://www.iith.ac.in/phdadmissions, https://gss.iith.ac.in/

నవ్య | చిత్రజ్యోతి



కలసి నటించాలని ఎదురుచూస్తున్నా...

'వార్-2' చిత్రంతో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముంబయి వెళ్లారు. తాజాగా, నటి ఊర్వశీ రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తారక్‌తో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుని.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ఎన్టీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో క్రమశిక్షణ, వినమ్రత, నిజాయితీ, ముక్కుసూటితనం కలిగిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్టీఆర్‌తో కలసి నటించాలని ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.

ఘనంగా తమిళ దర్శకుడు శంకర్ కుమార్తె వివాహం



ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ - ఈశ్వరీ శంకర్‌ల కుమార్తె ఐశ్వర్య వివాహం తరుణ్ కార్తికేయన్‌తో జరిగింది. సోమవారం చెన్నైలో జరిగిన ఈ వివాహ వేడుకలో తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చలన చిత్ర ప్రముఖులు రజనీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విక్రమ్, విశాల్, అర్జున్, కీర్తి సురేశ్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం - సుహాసిని దంపతులు, కె.భాగ్యరాజ్, పి.వాసు, కేఎస్ రవికుమార్, హరి, విష్ణువర్ధన్, విఘ్నేష్ శివన్ - నయనతార దంపతులు, నిర్మాతలు ఆర్బీ చౌదరి, జయంతిలాల్ గడ, ఏఎం రత్నం, దిల్ రాజు, ఐసరి కె.గణేశ్ తదితరులు హాజరయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

100 రోజులు... రూ. వంద కోట్లు



క్రికెట్‌లో సెంచరీ కొడితే ఆ ఆటగాడికి చెప్పలేనంత క్రేజ్.. ఫ్యాన్స్, మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేస్తాయి. అలాగే ఓ సినిమా రూ. వంద కోట్లు కలెక్ట్ చేస్తే ఆ చిత్ర బృందానికి వచ్చే కిక్కే వేరు. క్రికెట్‌లో ఆటగాడు సెంచరీ కొట్టాలంటే అది అతని ఒక్కడితోనే అయ్యే పని. కానీ సినిమా విషయం అలా కాదు. అది రూ.. వంద కోట్ల మైలురాయి చేరాలంటే దాని వెనుక చిత్ర బృందం కఠోర శ్రమ దాగి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ గడిచిన వంద రోజుల్లో ఈ డ్రీమ్ టార్గెట్‌ను అందుకున్న దక్షిణాది సినిమాల వివరాలు ఇవీ.

పూర్తి కథనం... ఈ-పేపర్‌లో...



'ఇప్పుడే 'పుష్ప 2' టీజర్ చూశా. అద్భుతంగా ఉంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటన నాకు బాగా నచ్చింది. ఆ సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'.. ఈ

పుష్ప 2 కు బాలీవుడ్ దర్శకుడి ప్రశంసలు

మాటలు అన్నది ఎవరో తెలుసా.. బాలీవుడ్ దర్శకుడు అనిల్ శర్మ. 'గదర్ 2' చిత్రంతో సూపర్ హిట్ సాధించిన ఈ దర్శకుడు తన ప్రశంసలను కొనసాగిస్తూ 'గత ఏడాది ఆగస్టు 15న నా చిత్రం 'గదర్ 2' విడుదలై మంచి విజయం సాధించింది. ఈ ఏడాది అదే రోజున 'పుష్ప 2' రిలీజ్ అవుతోంది. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు, ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు' అన్నారు.

ఐఫా వేదికపై శ్రీలీల మెరుపులు



చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగప్రవేశం చేసి అనతికాలంలోనే అగ్ర హీరోలతో జతకట్టే స్థాయికి చేరారు నటి శ్రీలీల. 'పెళ్లి సందడి', 'ధమాకా', 'స్కంద' 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' వంటి చిత్రాలతో వరుసగా సందడి చేసిన ఈ భామ జోరు ఇటీవల బాగా తగ్గింది. నటిగా కంటే మంచి డాన్సర్‌గా ఎక్కువ పేరు తెచ్చుకున్న ఈ నాజూకు భామకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. అయితే అది సినిమాలో కాదు. దుబాయ్‌లో సెప్టెంబరులో జరిగే ఐఫా ఉత్సవాలలో డాన్స్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు శ్రీలీల. మంచి డ్యాన్సర్‌గా పేరొందిన ఈ నటి ఐఫా వేదికపై తన మెరుపులతో ప్రేక్షకులను రంజింపచేయనున్నారు. అలాగే ఇటీవలే పెళ్లి చేసుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ కూడా తన నృత్యంతో ప్రేక్షకుల మతిపోగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఈ ఇద్దరు భామలు ఐఫా వేదికకు సరికొత్త అందం ఇవ్వనున్నారు. ఈ వేడుకలో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కూడా భాగం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో.. తెలుగు వేడుకలకి దగ్గుబాటి రానా ..మిగతా విభాగాలకు అకుల్ బాలాజీ, విజయ్ రాఘవేంద్ర వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.

నవ్వించడానికి సిద్ధం



'అల్లరి' నరేశ్ తన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌ను మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తోంది. చాలా రోజుల తర్వాత మళ్లీ నరేశ్ పూర్తి స్థాయిలో ఫన్ క్యారెక్టర్ పోషించడంతో ఈ సినిమా కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు రచన: అబ్బూరి రవి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: సూర్య, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.

ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం



'బిగ్ బాస్' ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రిక్ హీరోయిన్‌గా నటించిన 'తెప్ప సముద్రం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మాత. ఆదివారం రాత్రి ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి సినిమాలోని మొదటి పాటను విడుదల చేశారు. ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ 'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఎందరో కష్టపడాలి. నేను చిరంజీవిగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ 'చిన్న సినిమా అనగానే నిర్మాతకు, దర్శకుడికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మా నాన్న, పెద నాన్న డిస్ట్రిబ్యూటర్స్ కాబట్టి ఆ వేదన నాకు తెలుసు. ప్రతి ఒక్కరూ చిన్న సినిమాను బతికించాలని కోరుతున్నా. ఈ సినిమా 90 శాతం షూటింగ్ పోచంపల్లిలో జరిగింది' అని చెప్పారు. 'తెప్ప సముద్రంలో చిన్న పిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. అవి థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం' అని దర్శకుడు సతీశ్ చెప్పారు.

తెలుగులో తొలిసారి!



తెలుగులో సెటైరికల్ ఫిల్మ్ కొన్ని వచ్చాయి కానీ పొలిటికల్ సెటైరికల్ ఫిల్మ్ తక్కువ అనే చెప్పాలి. అందుకే ఈ తరహా కాన్సెప్ట్ ఎన్నుకొని ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి డైలాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఒక ఓటుకి ఇంత అని డబ్బు నిర్ణయిస్తుంటారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటుని నిర్ణయించడం విశేషం. ఇటువంటి కాన్సెప్ట్ తెలుగులో రావడం ఇదే తొలిసారి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ ముఖ్య పాత్ర పోషించారు. వినయ్, అరుణ్, దీప్తి వర్మ ఇతర ముఖ్య తారాగణం. తాడిపత్రి నేపథ్యంగా చిత్ర కథ ఉంటుందనీ, త్వరలో సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫూస్, ఛాయాగ్రహణం: నాని ఐనవల్లి, నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2hcliJG లో చదవండి.

అమరావతిలో.. అడుగడుగునా బ్రహ్మరథం

- రాజధాని గ్రామాలలో పెమ్మసాని , శ్రావణ్ ప్రచార హోరు
- వైసీపీ మండల అధ్యక్షుడు టీడీపీలో చేరిక


పెదపరిమిలో ప్రచారం చేసున్న ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్


ప్రచారంలో పాల్గొన్న రాజధాని గ్రామాల మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 15: రాజధాని గ్రామాల్లో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలుజల్లి హారతులిచ్చారు. బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. సోమవారం పెదపరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాల్లో ఇద్దరు ప్రచారం నిర్వహించారు. అనంతవరంలో పలు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. పెమ్మసాని పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత పెదపరిమి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. తుళ్లూరు మండల వైసీపీ అధ్యక్షుడు మాదల మహేంద్రకు పెమ్మసాని, శ్రావణ్‌కుమార్‌లు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతవరంలో గ్రామస్తులు మధ్యాహ్న భోజనం పార్టీ శ్రేణులకు ఏర్పాటు చేశారు. అనంతరం వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాలలో ప్రచారం జోరు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, అమరావతిని రక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని స్పష్టం చేశారు. కోడి కత్తి, బాబాయి హత్య గతంలో ఎన్నికల ప్రచారంలో వాడుకొని సెంటిమెంట్ సీఎం జగన్‌రెడ్డి పండించారన్నారు. ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. ఇప్పుడు సరికొత్తగా రాళ్ల దాడి ఘటన తెరమీదకు వచ్చిందన్నారు. ప్రతి పక్షంపై బురద జల్లే కార్యక్రమం జగన్‌రెడ్డి మొదలు పెట్టాడన్నారు. రాయి దాడిపై నిష్పక్షపాతంగా ఎక్వయరీ జరగాలన్నారు. ఒక్క ఛాన్స్ అని రాజధాని అమరావతి తో సహా రాష్ట్రాన్ని అధోగతి పాలు జేశారన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ఇవ్వటాన్ని ఎవరూ కాదనరు అన్నారు. పేదల జీవితాలు బాగుపడాలంటే రోజు వారి సంపాదన చూపించాలన్నారు. నెలకు రూ.50 వేలు సంపాదించే ఉపాధిని పేదలకు చూపాలన్నారు. అప్పుడే వారి జీవితాల్లో భరోసా నిండుకుంటుందన్నారు. అంతేకాని పావల సంక్షేమం ఇచ్చి, పన్నుల రూపంలో రూపాయి కాజేయటంతో పేదల జీవితాలు ఆర్థికంగా ఎలా ఎదుగుతాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదలు సంపన్నులు అవుతారన్నారు. చంద్రబాబు సంక్షేమంతో పాటు పేదలకు నిరంతరం ఉపాధి చూపే నాయకుడన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని పెమ్మసాని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 25వేల కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు టీడీపీ ప్రభుత్వంలో వేశామని చెప్పారు. ఈ వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల దోచుకుంటూ ఉందన్నారు. టీడీపీకి ఓటు వేసి అమరావతిని రక్షించుకోవాలని కోరారు.

ఆయా గ్రామాల ప్రచార కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, రైతు నాయకులు నూతలపాటి రామారావు, జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, సరిపూడి సాంబశివరావు, టీడీపీ నేతలు చుండు వెంకటరెడ్డి, పోతుగుంట నర్సయ్య, భాష్యం పెదశ్రీధర్, చిన శ్రీధర్, కర్నాటి శ్రీనివాసరావు, రావెల గోపాలకృష్ణ రామినేని చిన్నా, పోలు నర్సయ్య, జొన్నలడ్డ మధు, అనంతవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండ్ల సూరిబాబు, మద్దినేని రాంబాబు, గోరిజాల శ్రీనిసరావు, కాటా అప్పారావు, జమ్ముల అనిల్, సరిగల డేవిడ్, చిలకా బసవయ్య, తరిగోపుల సాంబశివరావు, వట్టికూటి బాబీ, మాజీ ఎంపీటీసీలు షైనేని గిరిజా, జొన్నలగడ్డ కిరణ్ పిన్నక సాంబశివరావు, జొన్నకూటి ఏడుకొండలు, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, గ్రామాల టీడీపీ అధ్యక్షులు అత్తిపట్ల బాలయ్య, పుచ్చకాయల గిరి, కొమ్మినేని కోటేశ్వరావు, కట్టానరసింహరావు, జనసేన, బీజేపీ , టీడీపీ కార్యకర్తలు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు అభ్యర్థులు పూలదండలు వేసి నివాళి అర్పించారు.


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతిని అవమానించిన వారిని తరిమికొట్టాలి

- 1581వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్15: రాజధాని అమరావతిని భక్షించాలనుకునే వారిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1581వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు, రైతులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధి పనులు దాదాపు రూ.9వేల కోట్లు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తట్ట మట్టి వేయలేదన్నారు. అమరావతిపై అబాండాలు, అసత్య ప్రచరాలు చేస్తూ నాశనం చేయాలని సీఎం జగన్‌రెడ్డి అండ్‌కో చూసిందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో భూములు ఇచ్చిన రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: తనపై నమ్మకంతో పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా ఎంపిక చేసిన తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఓ ప్రకటనలో హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఏడు శాసన సభ స్థానాల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి నారా చంద్రబాబునాయుడు శాసనసభ సాక్షిగా చేసిన ప్రతిజ్ఞ నెరవేరుస్తామన్నారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేసిన పల్నాడు జిల్లా నాయకులకు కార్యకర్తలకు ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తాం

- మాజీ మంత్రి ప్రత్తిపాటి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 15: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తామని మాజీమంత్రి, ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో లక్షకు పైగా జనాభా ఉన్న వారందరికీ 80 సంవత్సరాలు ఎదురుచూపులకు పరిష్కారం చూపిస్తామన్నారు. సోమవారం పట్టణంలోని వివేకానంద కాంప్లెక్స్‌లో జరిగిన తిరుమలై కల్లర్ కులస్తులతో ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటితో పాటు స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారంతా తమిళనాడు నుంచి వచ్చి రాష్ట్రంలో సుమా రు 80 సంవత్సరాలుగా జీవిస్తు న్నామని, ఏపీ ప్రభుత్వం తమ కు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరుచేయటం లేద ని, పిల్లలను పాఠశాలలో చే ర్పించాలన్నా, సంక్షేమ పథకా లకు దరఖాస్తులు చేసుకోవాల న్నా గుర్తింపులేక ఇబ్బంది పడుతున్నామని వారు ప్రత్తి పాటి, లావు దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ రాబోయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మీకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పల్నాడును.. సస్యశ్యామలం చేస్తాం

- సాగర్ కుడికాలువను స్థిరీకరణ చేస్తాం
- ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందిస్తా
- పిన్నెల్లి బాధితులను గుండెల్లో పెట్టుకుంటా
- ఆత్మగౌరవ సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, ఏప్రిల్ 15: పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే వరికపూడిశల ప్రాజెక్టు మంజూరు చేయించానని, అదేవిధంగా 2024 ఎన్నికల అనంతరం కృష్ణానదిపై మూడు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించి పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరా యలు పల్నాడు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జరిగిన ప్రజాగళం - ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడు తూ కొంతమంది అణగదొక్కాలని చూస్తున్నారని, దానికి రెండు రెట్లు వేగంతో నిప్పులు తొక్కుకుంటూ పైకి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తారనేదానికి నిదర్శనం పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనమని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పిన్నెల్లి గ్రామంలో 2019 ఎన్నికల తరువాత వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు, అకృత్యాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటమే కాకుండా భూములను బీడు భూములుగా మార్చారని ఆరోపించారు. పిన్నెల్లి వైసీపీ బాధితులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి ఏర్పాటు చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు సిలిండర్లు ప్రకటిస్తే యరపతినేని శ్రీనివాసరావు ఒక సిలిండర్ ప్రకటించారన్నారు. ముఖ్యంగా మైనారిటీ సోదరులకు బీజేపీతో కలవడం వల్ల 4 శాతం రిజర్వేషన్‌కు ఇబ్బంది కలుగుతుందనే అపోహలో పడవద్దని, రిజర్వేషన్‌కు ఎలాంటి ఇబ్బంది వుండదని తేల్చిచెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసేందుకు కూడా బీజేపీ సంసిద్ధంగా వుందన్నారు. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతో బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జంగా కృష్ణమూర్తి రాష్ట్రవ్యాప్తంగా తిరిగితే వైసీపీ నేడు ఆయనకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. డబ్బు అనే అహంకారంతో కాసు మహేష్‌రెడ్డి వున్నాడని, ఎల్లప్పుడూ డబ్బు సమస్యకు పరిష్కారం కాదని హితవు పలికారు. పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనాన్ని చూసి శ్రీకృష్ణదేవరాయలు భావోద్వేగానికి గురయ్యారు.

అభివృద్ధి తప్ప కక్ష సాధింపు వుండదు : ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ పాలనలో పిన్నెల్లి రావణకాష్టంగా మారిందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సభలో మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అహంకారానికి.. టీడీపీ అభివృద్ధికి మధ్య జరిగేవని, 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా పిన్నెల్లి వచ్చినప్పుడు అప్పుడు అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపించిందని, టీడీపీ హయాంలోనే పిన్నెల్లిని ఎంతో అభివృద్ధి పథంలో మార్చుతెచ్చామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పిన్నెల్లిలోనే 40 మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టి మహిళలపై అత్యాచారాలు, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ బీసీ కాపు సామాజికవర్గానికి చెందిన 11మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రోద్బలంతో హత్యలు చేశారని, కాసు అక్రమ సంపాదన కోసం ముక్కుపచ్చలారని 8మంది చిన్నారులు బలయ్యారన్నారు.ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడమే కాకుండా ప్రైవేటువ్యక్తుల పొలాలను కూడా ఆక్రమించుకున్న వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాసు అండదండలు పుష్కలంగా వున్నాయన్నారు. పల్నాడులో మాకు మాకు మధ్య తగాదాలు పెట్టడం కాసు మహేష్‌రెడ్డికి తగదని, సంపాదనే కావాలంటే నావద్ద వున్నవి ఇస్తాను.. అవి కూడా చాలకపోతే జోలెపట్టి అయినా నీకు అందజేస్తానని, ఇకనైనా అక్రమ సంపాదన కోసం ఏ ఒక్కరిని బలి తీసుకోవద్దని యరపతినేని సూచించారు. నేను, జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేలుగా వున్న సమయంలో పల్నాడు అభివృద్ధికి తపన పడ్డామే కానీ గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోలేదన్నారు. నరసరావుపేట, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కాసు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అంతా గురజాల సొమ్ముతోనే కాదా అని యరపతినేని ప్రశ్నించారు. రేపు రానున్న ప్రజా ప్రభుత్వంలో పిన్నెల్లి అభివృద్ధి కోసం 50 కోట్ల రూపాయలు కేటాయిస్తాను. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పిన్నెల్లి ఘటనలు నా మనసును ఎంతో కలచివేసిందన్నారు. ఉంటున్న ఊరు, కన్నతల్లిని వదిలి ఐదేళ్లు ఎక్కడెక్కడో వుండాల్సిన పరిస్థితి ఏ ఒక్కరికి రాకూడదన్నారు. నేను, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జంగా కృష్ణమూర్తిలు పిన్నెల్లిని అభివృద్ధి చేసి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని, రేపటి ఎన్నికలలో ప్రతిఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలన్నారు.

యరపతినేని గెలుపు నల్లేరుమీద నడకే: జంగా కృష్ణమూర్తి

రాష్ట్రంలో వైసీపీ అధికారంలో వుందనే అహంకారంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కిందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. పల్నాడు ప్రాంతంలో ఎన్నడూ లేనివిధంగా అక్రమ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయలు అక్రమ సంపాదన చేసుకొని రానున్న ఎన్నికల్లో డబ్బుల సంచులతో గ్రామాలలోకి వస్తున్నారని, డబ్బులు వైసీపీ వారివద్ద తీసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. ఒకప్పుడు యరపతినేని, నేను ప్రత్యర్థులమైనప్పటికీ పల్నాడు అభివృద్ధికే ప్రణాళికలు రూపొందించుకున్నాము తప్ప కక్షలు, కార్పణ్యాలను ప్రోత్సహించలేదన్నారు. నేడు మైనింగ్‌లకు గోరంత పర్మిషన్ తీసుకొని కొండంత దోపిడీ ఎమ్మెల్యే కాసు చేస్తున్నాడని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అనుమతి తీసుకొచ్చారని, దాని ద్వారా పల్నాడు ప్రాంతం సస్యశ్యామలంగా మారనున్నదన్నారు. గత ఎన్నికలలో నా సీటు కాసు మహేష్ రెడ్డికి త్యాగం చేస్తే నా సొంత గ్రామంలో కూడా మాకు పనులు కాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తారని ఆరోపించారు.

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపాం..

- తెలంగాణ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపామని.. ఏపీలో తిక్కోడిని కూడా మీరందరూ ఇంటికి పంపాలని తెలంగాణ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు. పిన్నెల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పరదాల మాటున ఐదేళ్లు గడిపిన జగన్‌రెడ్డి రేపటి ఎన్నికల తరువాత పూర్తిగా ఇంటికే పరిమితమవుతారన్నారు. 2014లో నాన్న లేడని.. 2019లో చిన్నాన్న లేడని... 2024లో తల్లీ, చెల్లీ లేరని నర్సిరెడ్డి వ్యాఖ్యానించారు. గంజాయి, అక్రమ సంపాదన, కౌలు రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలతో రాష్ట్రం మొదటి రెండు స్థానాలలో నిలిచిందన్నారు.


పావురాళ్లను ఎగరవేస్తున్న యరపతినేని, శ్రీకృష్ణదేవరాయలు, జంగా, నర్సిరెడ్డి తదితరులు


సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

జగన్‌కు రేపటి ఎన్నికలలో ఓటమి ఖాయమేనని నర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కర్నాటి వరలక్ష్మీ, జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అమీర్‌అలీ, మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, దున్నా చెన్నయ్య చౌదరి, యడ్లపల్లి రామారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, కొల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చింతపల్లి నన్నే, తాళ్లూరి అమర్‌నాథ్, యరవెద రామిరెడ్డి, పలు గ్రామాల దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

18న లావు శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్


శ్రీకృష్ణదేవరాయలు డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, ఏప్రిల్ 15: నరసరావుపేట లోక్‌సభ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కలెక్టరేట్ లోని పార్లమెంట్ నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు, ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి భారీగా కూటమి శ్రేణులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

211 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్


రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 15: నియోజకవర్గంలోని 211 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రత్యేక ప్రసారం ద్వారా ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 299 పోలింగ్ కేంద్రాలుండగా ఆయా చోట్ల ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంలు అదనంగా 40 శాతం తీసుకొచ్చామన్నారు. విజయపురిసౌత్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రూ.లక్ష పట్టుకున్నామని చెప్పారు. సోమవారం కూడా రూ.4.50 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. ఈవీఎంలను పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో భద్రపరిచామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంకు సంబంధించి వేరే రాష్ట్రాల్లో పనిచేస్తున్న 110 మందికి ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ పంపిస్తున్నామని, కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటలకల్లా మాకు అందితే ఓట్లు లెక్కిస్తామని అన్నారు. ఎన్నికల విధులు అతిక్రమించిన 8మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 19వ తేదీన ప్రధాన అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉందని, ఎవరికీ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, ఎలక్షన్ డీటీ బాషా తదితరులు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.04
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తాం..

- ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందిస్తాం
- ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు


తాళ్ళచెరువులో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, పక్కన భాష్యం ప్రవీణ్ తదితరులు

అచ్చంపేట, ఏప్రిల్ 15: ఇంటింటికీ వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. సోమవారం తాళ్ళచెరువు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తానని తెలిపారు. ఎత్తిపోతల పథకాలు మూలన పడ్డాయని, ఎన్నికల అనంతరం వాటికి మరమ్మత్తులు చేపట్టి వందలాది ఎకరాలు సాగులోకి తీసుకు వస్తాన న్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలు మళ్ళీ పునర్దురించి ఎస్సీల అభ్యున్నతికి బాటలు వేస్తానని ఎంపీ తెలిపారు. అధికారంలోకి రాగానే అర్హులైన వారికి రెండు సెంట్ల నివేశన స్థలంతో పాటు ప్రభుత్వం గృహం కూడా మంజూరు చేస్తామన్నారు. బీసీ డిక్లరే షన్ ద్వారా బీసీల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో ఎస్సీ వర్గీకరణ గురించి వివరిం చాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని సాగు, తాగు నీరు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చే యాలని, బూత్ లెవల్ కమిటీలు జాగ్రత్త వహించాలన్నారు. సమష్టిగా పనిచేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి, వెన్నా సాంబశివా రెడ్డి, నల్లమేకల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంగళరెడ్డి, మద్దిరాల గంగా ధర్ తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలో సర్పంచ్ రామావత్ కోటేశ్వర నాయక్ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. పది కుటుంబాల వారు కండువాలు కప్పుకున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది పార్టీలోకి వస్తారని కోటేశ్వరరావు నాయక్ తెలిపారు.

పాత టైర్ల ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం


దగ్ధమవుతున్న పాత టైర్ల ఫ్యాక్టరీ

నాదెండ్ల, ఏప్రిల్ 15: చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలోని అప్పాపురం డొంక పక్కన తిరుమల పాలిమర్ ప్రొడక్ట్స్ కంపెనీ ఫ్యాక్టరీలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు కోటి రూపాయలకు పైగా ఆస్థి నష్టం సంభవించినట్టు అంచనా. పక్కనే పొలాల్లోని రైతులు పత్తి కట్టెను తగల బెట్టడంతో నిప్పు రవ్వలు ఎగసి పడి ఈ టైర్ల ఫ్యాక్టరీకి అంటుకున్నాయి. మంటలు తీవ్రంగా ఎగసి పడటంతో రెండు గోడౌన్‌లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చిలకలూరిపేట, నరసరావుటలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ సందర్శించారు. చిలకలూరిపేట, నరసరావుపేట ఎస్ఎఫ్‌వోలు ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి, సుబ్బారావు ఆధ్వర్యంలో రాత్రి వరకు మంటలను ఆర్పుతూనే ఉన్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


అలవాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

రొంపిచర్ల, ఏప్రిల్ 15: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ బిందుమాధవ్ సోమవారం పరిశీలించారు. గోగుల పాడు, అలవాల గ్రామాల్లోని 41, 42, 43, 44, 45 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్య లు ఉంటే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వర్మ, సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ రవీంద్రలు ఉన్నారు.

1,22,620 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,32,603 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,22,620 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 84,395 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	8500	15000
273	9500	14000
341	9000	15000
4884	8500	13000
సూపర్ 10	9000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	8000	14500
తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

చంద్రబాబునాయుడుతోనే యువత భవిష్యత్తు

● వేగేశన నరేంద్రవర్మ సోదరులు వేగేశన మూర్తిరాజు, మధుబాబు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 15: యువత భవిష్యత్తు, మహిళాసాధికారత నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సోదరులు వేగేశన మూర్తిరాజు, మధుబాబులు సంయుక్తంగా తెలిపారు. మం డలపరిధిలోని అల్లూరు గ్రామపంచాయతీలోని అల్లూరురెడ్లపాలెం, యాదవపాలెం, గౌడపాలెం అల్లూరు సెంటర్, నత్తలవారిపాలెం ఎస్సీ, ఎస్టీకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో తన సోదరుడు వేగేశన నరేంద్రవర్మను ఎమ్మెల్యేగా, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. వేగేశన నరేంద్రవర్మ సోదరులు ఇంటింటికెళ్లి పార్టీ కరపత్రాలను అందజేశారు. నరేంద్రవర్మ తనయు డు వేగేశన రాకేష్‌వర్మ తనతండ్రిని అఖండ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మహ్మద్ ఖాశీం, అలకాపురం, వేగిరాజు, శివరామరాజు, మంతెన సుబ్బరాజు, గాదెరాజు మురళీ, మంతెన వెంకట నరసరాజు, పెనుమెత్స నాగరాజు, పెనుమెత్స రవివర్మ, మండే రాజేష్, మండే ప్రసాద్, నిజాంపట్నం నాగరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన చంద్రబాబుతోనే సాధ్యం

అమృతలూరు, ఏప్రిల్ 15: అవినీతి రహిత పాలన కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల ని నక్కా అఖిలేశ్ సోమవారం పేర్కొన్నారు. నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా పోటీ చేయుచున్న తన తండ్రి నక్కా ఆనందబాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండల పరిధిలోని ఇంటూరులో జరిగిన ప్రచారంలో ఇంటింటికి తిరుగుతూ తన తండ్రికి ఓటు వేయాలని అభ్యర్థించారు. దళితు లు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశ ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. ఆయన వెంట గొట్టిపాటి గంగాధర్, బోరు గడ్డ ఆనంద్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

దోనేపూడిలో వాహనాల తనిఖీ

కొల్లూరు, ఏప్రిల్ 15: ఎన్నికల నేపథ్యంలో భాగంగా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మం డల పరిధిలోని దోనేపూడిలో సోమవారం ఎస్ఐ రవీంద్రారెడ్డి, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల్లో నగదు పంపిణీ నిమిత్తం భారీ మొత్తంలో నగదు సరఫరాను అరికట్టేందుకు, రూ.50 వేలు నగదుకు మించి ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు చూపాలని ఎస్ఐ తెలిపారు.

జువ్వలపాలెంలో భద్రతా బలగాల కవాతు

కొల్లూరు, ఏప్రిల్ 15: ఎన్నికల్లో భాగంగా భద్రతా బలగాలు కవాతు నిర్వహించాయి. సోమవారం సాయంత్రం మండలపరిధి లోని జువ్వలపాలెంలో ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర భద్రతా బలగాలు గ్రామ పురవీధుల్లో కవాతు చేశాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణం వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసిందని, అందులో భాగంగానే భద్రతా బలగాలు కవాతు నిర్వహించినట్లు చెప్పారు.

ఎలక్ట్రికల్ పవర్ ఎంతో అవశ్యకం

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 15: శక్తివంతమైన ఎలక్ట్రికల్‌పవర్ ఎంతో అవశ్యకమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరా వు తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యం లో వారం రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌టెక్నిక్స్ ఇన్ ఎలక్ట్రికల్ సిస్టమ్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతులకు జాతీయ, అంతర్జాతీయ కళాశాలలు నుంచి డీఎం వినోద్ కుమార్, పి.రమేష్, ఎస్.సురేంద్రరెడ్డి, డి.రాకేష్‌చంద్ర, పి.సునీల్‌బాబులు రీసోర్స్‌పర్సన్‌లుగా వ్యవహరించారు. తరగతులను ముప్పలనేని ప్రారంభించి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతులకు ఎడ్యుకేషన్ సొసైటీ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మప్రసాద్, ప్రిన్సిపాల్ షేక్ నజీర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు చెందిన కులవృత్తులు ప్రోత్సహిస్తాం

● 50 సంవత్సరాలకే పింఛను
● ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబు



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

అమృతలూరు, ఏప్రిల్ 15 : బీసీ కులాలు కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటామని నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. సోమవారం అమృతలూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండలస్థాయిలో జయహో బీసీ సదస్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనందబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులాల వారికి 50 సంవత్సరాలకు పెన్షన్ ఇస్తుందని తెలిపారు. లక్ష రూపాయలు పెళ్లి కానుక ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే ఆకుటుంబానికి 10 లక్షలు ఆర్థిక సాయం చేస్తుందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన విధంగా 5 సంవత్సరాల్లో లక్షా 50 వేల కోట్లు బీసీ సంక్షేమం కోసం ఖర్చు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. బీసీల హక్కుల రక్షణ కోసం వారికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురావడంతోపాటు, సమాజంలో వారు ధైర్యంగా జీవించేలా ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో అచ్చన వెంకటేశ్వరరావు, బట్టు మలికార్జునరావు, రాయనప్రసాద్, బొంతా అంజనేయులు, చిలువోల్లంక చంద్రం, రామస్వామి, తాతా నాగేశ్వరరావు, ఓలేటి వసంతరావు, గొప్పరాజు కోటేశ్వరరావు, కరీముల్లా, యలవర్తి బ్రహ్మానందం, క్రొత్తపల్లి రవీంద్రబాబు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

అమృతలూరు మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, సొసైటీ మాజీ డైరెక్టర్ మన్నవ ప్రసాద్ అనారోగ్యంతో చనిపోయాడు. ప్రసాద్ మృతదేహంను నక్కా ఆనందబాబు సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలిపారు. ఆయన వెంట యలవర్తి బ్రహ్మానందం, జగదీష్ ప్రసాద్, యలమంచిలి జగన్మోహనరావు, మట్లపూడి జయపాల్, రావి రణధీప్, కూచిపూడి ఇసాక్, కొక్కిలిగడ్డ జక్రయ్య, రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

వేమూరు, ఏప్రిల్ 15: మండలంలోని వరహాపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుడు పులివర్తి గంగాధర్‌కు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు యల్లమాటి రాజు ఆధ్వర్యంలో 13వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన వేమూరు మురళీకృష్ణ రూ.5వేలు, యల్లమాటి రాజేంద్రప్రసాద్ రూ.5వేలు, ఎలవర్తి సాంబయ్య రూ.2వేలు, నవ్వా రమణయ్య రూ.వెయ్యి కలిపి రూ.13 వేలు ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాన్ని సందర్శించి అందజేశారు.

ఓటు హక్కు మనందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ పిచ్చిరెడ్డి

భట్టిప్రోలు, ఏప్రిల్ 15: ఓటు హక్కు మనందరి బాధ్యత ఓటు హక్కు కలిగిన వారందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఓటుహక్కు అవగాహనా నోడల్ ఆఫీసర్ వై పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ సమావేశం హాల్లో సోమవారం డ్వాక్రా సంఘాల మహిళలకు, సెర్ప్ సిబ్బందికి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఓటుహక్కు ఆవశ్యకతను గుర్తించాలని నూతన ఓటు నమోదు గురించి అవగాహన కల్పించారు. మండలంలోని పెదపులివర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. జిల్లా అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ పి.వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ఓటుహక్కు వినియోగించుకునేలా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గుడిమె ట్ల శ్రీమన్నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, కార్యదర్శి శ్రీదేవి, సీసీలు రజని, హనోక్, సాంబయ్య, అకౌంటెంట్ శిరీష, టీం సభ్యులు గోపిరెడ్డి, స్వాతి, యానిమేటర్లు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టాలి

● రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే
● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్



శంఖారావం కార్యక్రమంలో భాగంగా సూపర్-6 పథకాల గురించి వివరిస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

రేపల్లె, ఏప్రిల్ 15: రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాల ని టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం తథ్యమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణం లోని 5, 6వవార్డులో శంఖారావం కార్యక్రమంలో భాగం గా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ వైసీపీ ప్రజలను మరలా మోసం చేసేందుకు వలంటీర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని కుటిల రాజకీయాలు చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ప్రజలు వారి మాటలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామంటూ ఆర్భాటం చేస్తూ ప్రజలకు రూపాయి ఇస్తే జగన్ అండ్ కో రెండు వందలు దోచుకు తింటున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వస్తే ప్రజలంతా రోడ్డున పడేపరిస్థితి నెలకొందన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, గోగినేని పట్టాభిరామారావు, దేవగిరి రంగా, గుర్రం మురహరిరావు, నీలా కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పొన్నూరి గౌరీరామకుమారి, దున్నా జయప్రద, నాగశ్రీ, పి.లక్ష్మీనరసింహ, కారుమూరి జ్యోతి, జనసేన నాయకులు రాసంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కవితల పోటీల విజేతలు

బాపట్లటౌన్, ఏప్రిల్ 15: సాహితీభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీల విజేతల పేర్లను సాహితిభారతీ అధ్య క్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫీలు సోమవారం పత్రికలకు తెలియజేశారు. వేమూరు నియోజకవర్గం కాకర్లమూడికి చెందిన బొల్లి ముంత శ్రీనివాసరావు రచించిన 'తెలుసుకో ఈనిజం' కవితకు ప్రథమ బహుమతి, గుంటూరు చెందిన ఫాతిమా ఫిరోజ్‌ఖాన్ రచించిన 'రైతన్న' కవితకు ద్వితీయ, వేటపాలెంకు చెందిన పల్లప్రోలు రామ్‌మనోహర్ లోహియా రచించిన 'మనిషి ఆలోచనలో మార్పురావాలి' కవితకు తృతీయ బహుమతి లభించింది. కంకటపాలెంకు చెందిన ఆక్సీ రచించిన 'జీవన తరంగాలు', బాపట్లకు చెందిన సంపెంగి వారి జయచంద్రరెడ్డి రచించిన 'క్లాక్‌టవర్', వేటపాలెంకు చెందిన అక్కల బాలాజీరావు రచించిన 'ఉద్యోగాలు వేరేద్దామండి' అనే కవితలకు ప్రత్యేక బహుమతులు లభించాయని, విజేతలకు ఈ నెల 30వ తేదీన జరిగే శ్రీశ్రీ జయంతి సభలో వీరికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తారని సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మాల్యాద్రిరావు తెలిపారు.

ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటుపై ఆగ్రహించిన గ్రామస్థులు

● సర్పంచ్‌ని పిలిపించాలని కార్యదర్శితో వాగ్వివాదం



పాతనందాయపాలెంలో టవర్ విషయంపై కార్యదర్శిని వివరణ అడుగుతున్న గ్రామస్థులు

కర్లపాలెం, ఏప్రిల్ 15: శ్మశాన స్థలంలో గుట్టు చప్పుడు కాకుండా గ్రామస్థులకు తెలియకుండా ఎయిర్‌టెల్ టవర్ నిర్వాహకులతో సర్పంచ్ కుమ్మక్కై టవర్ నిర్మాణం కోసం సుమారు 15సెంట్ల భూమిలో గొయ్యి తవ్వించిన ఘటన మండలంలోని పాతనందాయపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే పాత నందాయపాలెంలో శ్మశాన స్థలంలో వచ్చే ఆదాయాన్ని గుడికి విచ్చేవిధంగా గ్రామపెద్దలు మాట్లాడుకొని గ్రామంలోని ఓరైతుకి భూమిని కౌలుకి ఇచ్చారు. రైతు భూమిని సాగు చేసుకొని పంటవేసుకోగా సర్పంచ్ గ్రామస్థులకు, గ్రామపెద్దలకు ఎవరికి తెలియకుండా శ్మశాన స్థలంలో గొయి తవ్వి ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం చేసేందుకు నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకొని సదరు సచివాలయ, గ్రామ కార్యదర్శులకు ఆదేశించాడు. వారు సర్పంచ్ మాటలు శాసనంగా తీసుకొని శ్మశాన స్థలంలో టవర్ నిర్మాణం కోసం ప్రొక్లెయిన్‌లతో పెద్ద గుంత తీశారు. శ్మశానంలో పంటవేసుకున్న రైతు గుంతను చూసి మాకు తెలియకుండా పంట మొత్తం నాశనం చేశారని పాత నందాయపాలెం గ్రామపెద్దలకు మొర పెట్టుకోవటంతో పెద్దలందరు, గ్రామస్థులు కలిసి శ్మశానంలో ఎవరు టవర్ ఏర్పాటు చేయమన్నారో గొయి ఎందుకు తీశారని సర్పంచ్‌ని పిలిపించాలని కార్యదర్శి పద్మావతి గ్రామపెద్దలు వాగ్వాదానికి దిగారు. ఈ సమాచార తెలిసిన ఎంపీడీవో శ్మశాన స్థలంలో ఎలాంటి టవర్ నిర్మాణాలు చేయటానికి అవకాశంలేదని తీర్మానాలు చేసినా నిర్మాణం చేసేందుకు అవకాశం ఉండదని వెంటనే నిలుపుదల చేయాలని కార్యదర్శులు పద్మావతి, మురళీలను ఎంపీడీవో నేతాజి ఆదేశించారు. కార్యదర్శి పద్మావతి ఈ విషయంపై మాట్లాడుతూ ఎంపీడీవో ఆదేశాల మేరకు నిలుపుదల చేశామని సర్పంచ్, ఎయిర్‌టెల్ టవర్ నిర్వాహకులకు కూడా సదరు విషయాన్ని తెలిపామన్నారు. గ్రామస్థులంతా శ్మశాన స్థలం వద్ద ధర్నాను చేయటానికి ఉపక్రమించటంతో ఎంపీడీవో చొరవ తీసుకొని టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని ఆదేశించారు. దాంతో గ్రామ ప్రజలు శాంతించారు.

ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలదే ప్రధాన భూమిక

● ఎన్నికల అధికారి వసంతరాయుడు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వసంతరాయుడు

వేమూరు, ఏప్రిల్ 15: ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలదే ప్రధాన భూమిక అని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు అన్నారు. సోమవారం వేమూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 487 మంది పీవోలు, ఏపీవోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే విధానంపై పూర్తిగా అవగాహన పొంది ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా స్వామ్య వ్యవస్థకు సంబంధించిన ఎన్నికల నిర్వహణలో తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్క్రీన్‌ప్లే ద్వారా అనేక విషయాలను తెలియజేశారు. అనంతరం ఈవీఎంలపై శిక్షణ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో పీడీఎంఎస్ యాప్ పూర్తి చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని, దానిని ఉపయోగించే విధానాన్ని తెలిపారు. మాక్ పోల్ చేసే విధానం ఈవీఎం ల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించా రు. పోస్టల్ బ్యాలెటు కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాల ని తహసీల్దార్ల కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు సెక్టార్ అధికారులు హాజరయ్యారు.

ఇంటర్లో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కొల్లూరు, ఏప్రిల్ 15: జీవీఎస్ఆర్ అండ్ ఎస్ఏఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సుంకర రామ్మోహనబాబు సోమవారం తెలిపారు. కొల్లూరులోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సీఈసీలో సభావత్ దుర్గాప్రసాద్‌నాయక్ 878 మార్కులు, ఎంపీసీలో బెజ్జం వాణి 791, మొదటి సంవత్సరం విద్యార్థులు అన్నంనేని నాగశ్రీ 470 మార్కులకు గాను 392 మార్కులు, కటెవరపు స్నేహజ 389 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

కాంగ్రెస్‌తోనే బాపట్ల జిల్లా అభివృద్ధి

● మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం

బాపట్ల,ఏప్రిల్ 15 : బాపట్లజిల్లాను అభివృద్ధి చేసే సత్తా కాంగ్రెస్‌కే ఉందని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు అధ్యక్షతన సోమవారం సాయంత్రం ఇండియాకూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రమంత్రిగా పనిచేసిన తాను బాపట్ల ప్రాంత సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని ప్రశ్నించేందుకు తనను గెలిపించాలని కోరారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించిందని నెపం వేసేముందు వైసీపీ, టీడీపీలు రాష్ట్రాన్ని ఎంతమేర అభివృద్ధి చేశారో ఆలోచించుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కేంద్ర, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బాపట్ల ఎంపీగా పోటీచేస్తున్న తనకు మద్దతు తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షలు పఠాన్ రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, యువనేత శీలం మౌర్య, సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, చీరాల ఏరియా కార్యదర్శి బత్తుల శామ్యూల్, రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు చింతాబాబురావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.శంకర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు ఎస్‌విఆర్ కుమార్, బక్కా రోశయ్య, శీలం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 15 : రైలు నుంచి జారిపడి ఓవ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన జూన్యుల్ టాప్‌నో (35) అనే వ్యక్తి భర్తిపూడి గ్రామసమీపంలోకి రైలు రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్‌పై పడి మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారని రైల్వే పోలీసులు చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బాపట్లరూరల్ ఏప్రిల్ 15 : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన అంజలి (63) అనే వృద్ధురాలు మూడు రోజుల క్రితం నరసాయపాలెం నుంచి బాపట్ల వైపుకు వస్తుండగా ద్విచక్రవాహనంపై నుంచి జారీ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే ఆ వృద్ధురాలు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని



ఐలవరంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని

భట్టిప్రోలు, ఏప్రిల్ 15 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారానే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని ఐలవరంలో గ్రామ టీడీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముమ్మనేని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. విభేదాలను వదిలిపెట్టి ఐకమత్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ముమ్మనేని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వాకా శేషుబాబు, బీజేపీ ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మాచర్ల నాగరాజు, గంగాధర్, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, డోలా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కోన తీరు దారుణం

● అంటరానితన నిర్మూలన పోరాటసమితి అధ్యక్షుడు జి.చార్వాక
● దళితులకు బేషరత్‌గా క్షమాపణ చెప్పాలి

బాపట్ల, ఏప్రిల్ 15: భారతరాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యవహరించిన తీరు దారుణమని అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక పేర్కొన్నారు. దళిత సంఘాల నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సర్కిల్‌లో టీడీపీ శ్రేణులు ముందుగా వచ్చి నివాళులర్పించే సమయంలో ఎమ్మెల్యే కోన రఘుపతి తన అనుచరులతో వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడటమే కాకుండా అలజడి సృష్టించి దళితుల మధ్య విభేదాలు సృష్టించారన్నారు. రాజకీయంగా తమ బలాబలాలు నిరూపించుకోవాలంటే బయట చేసుకోవాలని దళితుల ఆరాధ్యదైవం అంబేద్కర్ జయంతి వేడుకల వద్ద రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేస్తూ దళిత బిడ్డలను వర్గాలుగా విభజించి కేసుల్లో ఇరికించటం సరికాదన్నారు. ప్రతి ఏడాది అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకునే దళితులను విభజించి పాలించేవిధంగా చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతూ దళితులను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో అంబేద్కర్ సేవాసమాజం అధ్యక్షుడు దగ్గుమల్లి కిరణ్‌కుమార్, మాలమహానాడు నాయకులు శీలం రోజన్‌బాబు, వందనం, శామ్యూల్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి ప్రచారానికి అపూర్వ స్పందన

● ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ



కొల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయ కులు, కార్యకర్తలు

కొల్లూరు, ఏప్రిల్ 15: టీడీపీ కూటమి శాసనసభ, పార్లమెంట్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. సోమవారం సాయంత్రం వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ల తరపున ఆయా పార్టీల నాయకులు కొల్లూరులో ప్రచారం నిర్వహించారు. గౌడపాలెంలోని ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఆనందబాబు, కృష్ణాప్రసాద్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రచారంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, జనసేన నాయకులు సమ్మెట దుర్గాప్రసాద్, మేకా బాలాజీ, శివయ్య, టీడీపీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు, గుమ్మడి శివ, కొడాలి నారాయణ, పబ్బిశెట్టి సత్యకుమార్, ఎన్నారై మణికంఠ, పమిడిముక్కల శిరీష, కొత్తపల్లి మధు, కాసరనేని మోహన్, వెలివెల శ్రీరాములు, సుంకర రమేష్, రాంప్రసాద్, దివి సీతారామయ్య, మోహనకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

54 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామ లేఖను ఎంపీడీవో నేతాజికి సమర్పిస్తున్న కర్లపాలెం వలంటీర్లు

కర్లపాలెం, ఏప్రిల్ 15 : కర్లపాలెం మండలంలో 5గ్రామాలు నుంచి 54మంది వలంటీర్లు సోమవారం రాజీనామ చేశారని ఎంపీడీవో నేతాజి తెలిపారు. మండలంలోని పెదపులుగువారిపాలెం పంచాయతీలో 11, పేరలిపంచాయతీలో 7, తుమ్మలపల్లి లో 1, నల్లమోతువారిపాలెంలో 6, కర్లపాలెంలో 29 మంది వలంటీర్లు రాజీనామ చేసినట్లు లేఖలను అందించారని ఎంపీడీవో వివరించారు. వారి రాజీనామ పత్రాలను ఆమోదించామని నేతాజి తెలిపారు.

బాపట్ల మండలంలో 43మంది..

బాపట్లరూరల్, ఏప్రిల్ 15: బాపట్ల మండలంలో 43మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఎంపీడీవో పి.విజయశేఖర్‌కు అందజేశారని తెలిపారు.

● బాపట్ల పట్టణంలోని ఐదుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్యకు అందజేశారు.

భవనవారిపాలెంలో 13 మంది..

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 15: మండలపరిధిలోని భవనంవారిపాలెంలో 13 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. సోమవారం ఎంపీడీవో బీవీ రమణమూర్తికి వలంటీర్లు తమ రాజీనామపత్రాలను భవనంవారిపాలెం ఇన్‌చార్జి కార్యదర్శి కె.వసుంధరలక్ష్మీతో కలిసి అందజేశారు. అదేవిధంగా పిట్టువారిపాలెంలో ఆరుగురు వలంటీర్లు ఎంపీడీవోకు రాజీనామపత్రాలు అందజేశారు.

వేమూరు మండలంలో ఏడుగురు..



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

వేమూరు, ఏప్రిల్ 15 : మండల పరిధిలో జంపని గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు, చదలవాడ నుంచి ఒకరు, వరహాపురం నుంచి ఒకరు సోమవారం రాజీనామా పత్రాలు సమర్పించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బాపట్ల, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాప ట్ల పాతబస్టాండ్, గడియార స్తంభంసెంటర్, రైల్వేస్టేషన్, సినిమా థియేటర్‌లలో అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. అగ్నిమాపకాధికారి వై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలిలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. తద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సమాజవాదిపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 15 : సమాజవాదిపార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా గొర్ల శ్రీనివాసరావు (మేడాశ్రీను)ను ఎంపిక చేస్తూ అధిష్టానం ప్రకటించింది. మేడా కాలేజి డైరెక్టర్‌గా బాపట్ల పరిసర ప్రాంత ప్రజలకు సుపరిచితుడు.

టీడీపీలోకి చేరికల జోరు

» కోళ్లపూడి, చినగంజాం, పూసపాడుకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైసీపీకి గుడ్‌బై
» ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సైకిలెక్కిన శ్రేణులు


టీడీపీలో చేరిన పూసపాడు వాసులు


వైసీపీ వీడి టీడీపీలో చేరిన కోలలపూడి గౌడ సోదరులు

పర్చూరు, ఏప్రిల్ 15: పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారు. రాజకీయాలకు అతీతంగా వేలాది మంది ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి వెళ్లేందుకు సైకిలెక్కు తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వైసీపీ ప్రధాన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. కార్యక్రమం లో భాగంగా సోమవారం మార్టూరు మండలం కోలలపూడి, చినగంజాం, ఇంకొల్లు మండలం పూసపాడు నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

కోలలపూడిలో..

మార్టూరు మండలం కోలలపూడి నుంచి భారీ ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూ రి సాంబశివరావు సారథ్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వీరికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో తాతా అమరయ్య, గోరంట్ల వెంకటనారాయణ, నాగేశ్వరరావు, తాత శివాజీ, తాతా వెంకటేశ్వరరావు, సూరగాని కొండయ్య, తాతా రాంబాబు, తాతా గంగయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, బుద్ధం శ్రీను, గుడిపల్లి శ్రీనివాసరావు, పర్సా పోతురాజు, గాలి ఏడుకొండలు, తాతా వెంకటనారాయణ, తాతా కోటేశ్వరరావులు చేరారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, కందిమళ్ల కొండలురావు, తాటి నాగార్జున, నాయకులు ఉన్నారు.

పూసపాడులో..

ఇంకొల్లు మండలం పూసపాడులో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిలో కంకటం వెంకట్రావు, వెంకటసుబ్బారావు, రాజుపాలెం నాగు, దేశ పోతురాజు, పోతినిశెట్టి శ్రీనివాసరావు, మంగిశెట్టి నాగశ్రీను, వెంకటనాగేశ్వరావు, కంకట కృష్ణారావు, కంచేటి రాఘవరావు, శివరాజు చెన్నయ్య, కంకట లక్ష్మీనారాయణ, కంకట మాధవరావు, నీలకఠం నాగశ్రీను, కంకటం నవీన్, దేశ రాములు, గుమ్మడి శ్రీను, దేశు శ్రీను, వెంకట భాస్కర్‌రావు, శివరాజు నాగశ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ బొంతా వెంకటసుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మద్దుకూరి బ్రహ్మం, కంటక వెంకట రాంబాబు, గంటా బాబు, రమేష్ పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం గ్రామ అంబేద్కర్‌నగర్, మసీద్‌పేట సోపిరాలకు చెందిన వైసీపీ నాయకులు సోమవారం ఏలూరి సమక్షంలో చేరారు. వీరికి ఏలూరి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మార్పు సుకుమార్, గేరా ఆశా, సలగల గోపి, మేడికొండ వంశీ, దాసరి దీపక్, మేడికొండ గురవయ్య, షేక్.గౌస్ భాషా, సుబానీ, బహీర్, అచ్చుతుని పద్మప్రియ, నందం లీలావతి, అన్నం జయప్రద, షేక్ రబ్బానీ, షేక్ మదరాసా, కాయల మురళి, షేక్ ఖలీల్, సలీమ్, షేక్ సైఫ్ బాషా, బాజీ, కరిముల్లా, షఫీ, పఠాన్ అయూబ్ ఖాన్, ఇర్ఫాన్, అబ్దుల్ అజీజ్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరారు.

టీడీపీలోకి పూసపాడు వైసీపీ నాయకులు

ఇంకొల్లు, ఏప్రిల్ 15 : మండలంలోని పూసపాడుకు చెందిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. ఏలూరి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గుమ్మడి శ్రీనివాసరావు, కరణం రమేష్, కంకట మాధవరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, కె.రాఘవరాజు, శివరాజు, చెన్నకేశవరావు, కె.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, నవీన్‌కుమార్, గంటబాబు, బొడావుల రఘురాం, నీలకంఠం, నాగశ్రీను, మాకినేని నాగేశ్వరరావుతో పాటు పలువురు ఉన్నారు.

కోరీ గుంటల్లో టీడీపీ మహిళల ప్రచారం

మార్టూరు : మార్టూరు గ్రామంలో సోమవారం టీడీపీ మహిళా కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కొణిదెన రోడ్డు, కోరీ గుంటల్లో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క చాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డికి మరో చాన్స్ ఇవ్వొద్దన్నారు. రాష్ట్రం బాగు కోసం, మహిళలు ఆర్థిక భరోసా కోసం చంద్రబాబు ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరిని, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అంబడిపూడిలో వైసీపీకి షాక్

» వర్గీయులతో గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన అంబడిపూడి సర్పంచ్

బల్లికురవ, ఏప్రిల్ 15 : మండలంలోని అంబడిపూడి గ్రామానికి చెందిన సర్పంచ్ మైలా కుసుమకుమారి తన వర్గీయులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అంబడిపూడి గ్రామానికి చెందిన మద్దుమాల రాజమోహన్, కోటేశ్వరరావు, వేణుబాబు, ఎర్రిబోయిన ప్రసాద్, గంగవరపు వాసుబాబు, మక్కెన పుల్లారావు, బండారు వెంకటేశ్వర్లు, గుదే వసంతరావు, కొరివి రాజీవ్‌గాంధీ, నేలటూరి జయరావు తదితరులు పేటలోని ఎమ్మెల్యే రవికుమార్ ఇంటికి వెళ్లి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ సర్పంచ్, వర్గీయులు పెద్ద ఎత్తున టీడీపీలోకి రావడంతో వైసీపీకి షాక్ తగిలింది. వారందిరికీ కండువాలు వేసి స్వాగతించిన గొట్టిపాటి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నేతలు మండలపు సుధాకర్, దద్దాల అంజయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన వనం అంజనేయులు, గుర్రాల అనిల్, మరో పది కుటుంబాలు గొట్టిపాటి సమక్షంలో సైకిలెక్కారు.

గొట్టిపాటిని గెలిపించండి
బాబీ ఇంటింటి ప్రచారం

బల్లికురవ : రెండు దశాబ్దాలుగా ప్రజా సేవ చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమలకిషోర్ (బాబీ) కోరారు. సోమవారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో బాబీ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన కృష్ణప్రసాద్, రవికుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని గుల్ల చేసిన జగన్‌రెడ్డిని, వైసీపీని ఇంటికి పంపాలన్నారు. ఇన్నాళ్లూ బటన్ నొక్కి మోసగించిన వైసీపీ పాలకులను వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి బుద్ధి చెప్పాలని బాబీ పిలుపు నిచ్చారు. రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్ కోసం కూటమికి ప్రజలంతా ఏకపక్షంగా మద్దతు పలకాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేటి ఇజ్రాయల్, సింగరకొండ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్

అసలే అధ్వానం..ఆపై మురుగు నీరు..!

» అభివృద్ధికి నోచుకోని పర్చూరు మంచి నీటి చెరువులు
» కాలువ పరిస్థితి మరింత దయనీయం
» కలుషిత నీటితో కాలం వెళ్లదీస్తున్న ప్రజలు
» చెరువుల మరమ్మతులను గాలికొదిలేసిన అధికారులు
» ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు



చిల్లచెట్లు, తామరతో అధ్వానంగా మంచినీటి చెరువు
మంచినీరు పంపించే వరవ కాలువ దుస్థితి

పర్చూరు, ఏప్రిల్ 15 : ఏళ్ల తరబడి మంచినీటి చెరువులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో కలుషిత నీటితోనే ప్రజలు రోజులు వెళ్లదీస్తున్న దుస్థితి నెలకుంది. చిల్లచెట్లు, తుంగ, తామరతో నిండిపోవడంతో ఉన్న నీరుకాస్త రంగుమారి కంపుకొడుతోంది. కనీసం చెరువులను శుభ్రం చేసేందుకు బ్లీచింగ్‌ను కానీ, సున్నంను కానీ వినియోగిస్తున్న దాఖలాలు లేవు. దీనికితోడు చెరువులను నింపుకునేందుకు వినియోగించుకునే కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. అపరిశుభ్రంగా కలుషితంగా ఉన్న కాలువల నుంచే మంచి నీటిని చెరువులకు నింపుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజారోగ్యంపై పాలకుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కన్పిస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో మంచినీటి చెరువుల పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. పర్చూరులో ప్రజల మంచినీటి అవసరాల కోసం రెండు చెరువులు ఉన్నాయి. ఉన్న రెండు చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ చెరువులను వాగు ద్వారా నింపుకోవాల్సి ఉంది. వాగు నుంచి మంచినీటి చెరువులకు నీరు చేరే వరవ కాలువ అధ్వానంగా మారింది. కాలువలో వ్యర్థాలు చేరి కలుషితమై కంపుకొడుతోంది. ప్రస్తుతం మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని చెరువులకు నింపేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే మంచి నీటి చెరువులకు నీరు చేరే వరవ దారుణంగా ఉండడంతో కలుషిత నీరే చెరువులకు చేరుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కనీసం వరవ కాలువనైనా శుభ్రంచేసేలా అధికారులు చర్యలు చేపట్టక పోవడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లుతెరిచి మంచినీటి చెరువుకు నీటిని సరఫరా చేసేందుకు వినియోగిస్తున్న వరవ కాలువను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం వల్లే నీటి కష్టాలు

» టీడీపీ రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తా
» కూటమి అభ్యర్థి గొట్టిపాటి


13వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 15 : వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్లే పట్టణ ప్రజలు నీటి కష్టాలకు నిదర్శనమని ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, వార్డులలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడంలేదన్నారు. పలువురు మహిళలు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని గొట్టిపాటి హామీ ఇచ్చారు. రూ.82 కోట్లతో నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ పాలకులు లబ్ధిదారులకు కట్టబెట్టలేదన్నారు. జగన్‌రెడ్డి నవరత్నాల ముసుగులో రూ.10 ఇచ్చి.. పేదల నుంచి రూ.100 గుంజారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ బస్సు, కరెంట్, గ్యాస్, నిత్యావసరాల ధరలతో పేదలు అల్లాడిపోతున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. పెరిగిన ధరలను తగ్గిస్తామన్నారు. చంద్రబాబు పాలనలో అమలు చేసిన 100 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. జగన్‌రెడ్డి వడ్డెర్లతోపాటు బీసీలకు ద్రోహం చేశారన్నారు. టీడీపీ రాగానే సత్యపాల్ కమిటీ ఆధారంగా వడ్డెర్లకు న్యాయం చేయడంతో పాటు 10 లక్షల చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా గొట్టిపాటిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయలక్ష్మి మాధవరావు, చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, గుంజి శ్రీనివాసరావు, బోజనపల్లి సత్యనారాయణ, మామిడి రాంబాబు, బీ రామాంజనేయులు, యరాకుల రామాజనేయులు పాల్గొన్నారు.

అలాగే కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కోరుతూ 5వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గార్లపాటి శ్రీనివాసరావు, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనీల్, పొన్నలూరి కిరణ్, చిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండన్నకు మద్దతిద్దాం.. కూటమిని గెలిపించుకుందాం


కొండయ్యకు మద్దతు తెలుపుతున్న అక్కాయిపాలెం యువకులు

చీరాల, ఏప్రిల్ 15 : టీడీపీలోకి చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో చేరుతున్న అభిమానులను కొండయ్య ఆత్మీయంగా స్వాగతిస్తున్నారు. అందులో భాగంగా వేటపాలెం మండలం అక్కాయిపాలెంకు చెందిన పలువురు యువకులు సోమవారం పార్టీ కార్యాలయంలో కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. అప్పుడే రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొని, అభివృద్ధికి అడుగులు పడతాయన్నారు.

వేటపాలెం మండలం పాపాయిపాలెంలో టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య గెలుపొందాలని కోరుతూ కొండయ్య కుమారుడు గౌరీ అమర్‌నాథ్ నాయకులు, కార్యకర్తలను కలసి కోరారు. అందులో భాగంగా నూతనంగా పార్టీలో చేరేందుకు వచ్చిన వారిని సాదరంగా స్వాగతించారు. భవిష్యత్ కార్యాచరణపై సూచనలు చేశారు.

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో కూటమి అభ్యర్థి కొండయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కా ర్యకర్తలు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపు.. అభివృద్ధికి మలుపు అం టూ నినాదాలు చేశా రు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండయ్య గెలుపే అందరి లక్ష్యం

» టీడీపీ నేత డాక్టర్ హేమలత
» స్వతంత్ర అభ్యర్థిగా పోటీ నుంచి విరమణ

చీరాల : కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య గెలుపే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగుతామని టీడీపీ నేత డాక్టర్ సజ్జా హేమలత చెప్పారు. స్థానిక లైఫ్ ఆసుపత్రిలో సోమవారం కూటమి అభ్యర్థి కొండయ్యతో కలసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన కొండయ్య గెలుపు అనేది ముందస్తుగా అనివార్యమన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలన్న తన ఆలోచనను విరమించు కున్నట్లు డాక్టర్ హేమలత ప్రకటించారు. దీంతో టీడీపీ లో నెలకొన్న అంతర్గత పోరు కు తెరపడినట్లయింది. నిన్న, మొన్నటి వరకు డాక్టర్ హేమలత అడుగులపై పార్టీలోని కొన్ని వర్గాల్లో సందిగ్ధం నెలకొంది. తాజా గా హేమలత అధిష్ఠాన నిర్ణయం అంతిమంగా శిరోధార్యమని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తం వ్యక్తమవుతోంది. కూటమి భాగస్వాములైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి. మొత్తమ్మీద కూటమి పార్టీలు, భావస్వారూప్యం కలిగిన ప్రతి ఒక్కరూ కొండయ్య గెలుపుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వారు స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, ఎన్నికల పరిశీలకుడు ముప్పవరపు వీరయ్యచౌదరి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కొండయ్య, టీడీపీ నాయకులు

సమష్టిగా అడుగులు వేద్దాం
సత్ఫలితాలు సాధిద్దాం : కొండయ్య

వేటపాలెం(చీరాల) : సమష్టిగా అడుగులు వేద్దాం. సత్ఫలితాలు సాధిద్దామని కూటమి అభ్యర్థి కొండయ్య పిలుపునిచ్చారు. ప్రధాన కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ముప్పవరపు వీరయ్య, సీనియర్ నాయకుడు నాశిక వీరభద్రయ్య తదితరులతో కలసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు


సాగర్ జలాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఈవో

మార్టూరు, ఏప్రిల్ 15 : తాగునీటి కోసం విడుదల చేసిన సాగర్ జలాలు మండలంలోని మంచినీటి చెరువులకు చేరుతున్నాయి. రెండు రోజులుగా సాగర్ కాలువ నుంచి గ్రామాలలోని చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. మండలంలో మొదట వలపర్ల చెరువుకు సాగర్ జలాలు చేరాయి. సాగర్ మెయిన్ కాలువ నుంచి కోనంకి సబ్‌డివిజన్ పరిధిలోని రాజుపాలెం మేజర్ గుండా సాగర్ జలాలు మార్టూరు చెరువుకు చేరుతున్నాయి. మేజర్ పంచాయతీ మార్టూరు చెరువును నింపాలంటే 30 రోజుల సమయం పడుతుంది కానీ ప్రస్తుతం అన్ని రోజులు సాగర్ జలాలు వచ్చే అవకాశం లేనందున ఎంతవరకు వస్తే అంత నింపుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం పంచాయతీ అధికారులు నాలుగురోజుల కిందటే మరమ్మతులు చేశారు. చెరువు వద్ద అదనంగా నీటి ఇంజన్‌ను కూడా ఏర్పాటు చేశారు. వాటిని ఎంపీడీవో నితిన్, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పరిశీలించారు. మండల కాంప్లెక్స్ వెనుక ఉన్న బాలకృష్ణ కుంటకు సోమవారం సాగర్ జలాలు చేరేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా మద్దిసీతాదేవినగర్, మద్దిసత్యంకాలనీ, విద్యానగర్, సంపత్‌నగర్‌లలో బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశముంది. ఇదిలా ఉండగా ఇప్పటికి సాగర్ జలాలు నీటి ప్రవాహం ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. ఈ విధంగానే సాగర్ జలాలు వస్తే మండలంలో చెరువులు 50 శాతం కూడా నిండే అవకాశం లేదు. ప్రస్తుతం సోమవారం సాయంత్రానికి బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద 330 క్యూసెక్కులు, ద్రోణాదుల మేజర్‌కు 90, నూతలపాడు మైనర్‌కు 90, కోటపాడు మేజర్‌కు 40, రాజుపాలెం మేజర్‌కు 25 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఏఈ రాజేష్ తెలిపారు.

రేపు శ్రీరామ నవమి వేడుకలు


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి

మార్టూరు, ఏప్రిల్ 15 : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా బుధవారం మండలంలోని కోదండ రామస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో ఏటా కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని భక్తులు వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా స్వామి వారి కల్యాణానికి తాటాకు పందిళ్లను ఏర్పాటు చేశారు. మార్టూరులో తూర్పు బజారున, పడమర బజారున, నేతాజీనగర్ లో, జనార్దన్ కాలనీలో రాములోరి కల్యాణానికి సర్వంసిద్ధం చేశారు. రాజుపాలెం గ్రామంలో ఏటా కోదండ రామస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

రేపు యువత మేలుకో వాక్

ఇంకొల్లు, ఏప్రిల్ 15 : ఇంకొల్లులో పర్చూరు తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో యువత మేలుకో పేరుతో ఈ నెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు బొమ్మల సెంటర్ నుంచి 2కిలో మీటర్ల మేర చేయనున్న వాక్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొంటున్నారు. పెద్ద ఎత్తున యువత పాల్గొని వాక్‌ను జయప్రదం చేయాలని టీడీపీ నాయకుడు హనుమంతరావు, డాక్టరు బోడాల శ్యాంసుందర్, రామకృష్ణ కోరారు.

గ్రామాల్లో బలగాల కవాతు


జొన్నతాళి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మార్టూరు, ఏప్రిల్ 15 : కేంద్రబలగాలతో స్థానిక పోలీసులు సోమవారం మండలంలోని జొన్నతాళి, ఇసుక దర్శి, లక్కవరం, చిమ్మిరి బండ గ్రామాలలో కవాతు నిర్వహించారు. మార్టూరు స్టేషన్ ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది కేంద్ర బలగాలతో పోలీసులు ప్రధాన వీధులలో కవాతు నిర్వహించారు. గ్రామాలలో యువకులు గొడవలను ప్రోత్సహించకుం డా చూడాలని రాజశేఖర్‌రెడ్డి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్ శూన్యమవుతుందని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సైదా, పోలీసులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ

సంతమాగులూరు, ఏప్రిల్ 15: సంతమాగులూరు, ఏప్రిల్ 15 : ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించి చట్ట వ్యతిరేక చర్యలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని రౌడీ షీటర్లు ఉన్న వారు తరచూ పోలీస్‌స్టేషన్ అటెండ్ అవ్వాల్సిన పని ఉంటుందని తెలిపారు. మండల కేంద్రమైన సంతమాగులూరు సర్కిల్ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలోసిఐ నరసింహారావు మాట్లాడుతూ గ్రామాలలో బెల్ట్ షాపులపై కొరడా జోడిపించడం జరుగుతుందని ఎప్పటికప్పుడు గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియపరచాలని తెలిపారు. అదేవిధంగా వాహనాలపై వివిధ రాజకీయ పార్టీల పోస్టర్లు ఉన్నట్లు గుర్తిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

19 మంది వలంటీర్ల రాజీనామా

చినగంజాం, ఏప్రిల్ 15 : మండలంలోని గొనసపూడి, మున్నంవారిపాలెం గ్రామాలకు చెందిన 19 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో యాబీ వరప్రసాద్ తెలిపారు. మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సోమవారం ఎంపీడీవోకు అందజేశారు. గొనసపూడి గ్రామ సచివాలయ పరిధిలోని 19 మంది వలంటీర్లుకు గాను 9 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి కార్యదర్శి కే కృపారావుకు ఇవ్వగా, మున్నంవారిపాలెం సచివాలయ పరిధిలో 12 మంది వలంటీర్లు గాను 10 మంది రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మహిళకు తీవ్రగాయాలు



పర్చూరు, ఏప్రిల్ 15: గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందగా, మరో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పర్చూరు - జాగర్లమూడి ఆర్‌అండ్‌బీ రహదారిలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెద్దవారిపాలెం గ్రామానికి చెందిన రావి విజయ్ భాస్కర్(43) పర్చూరు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామం పెద్దివారిపాలెం వెళుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌భాస్కర్ తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోయాడు. ఇతనితో పాటు బైక్‌మీద ప్రయాణిస్తున్న బంధువైన మహిళకు గాయాలయ్యాయి. ఇద్దరినీ 108లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయ్‌భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు తరలించగా మధ్యలోనే మృతి చెందారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విజయ్‌భాస్కర్ ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప వార్షికోత్సవం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 : శింగరకొండలోని అయ్యప్ప స్వామి ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, పాణెం నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, గురుస్వామి వీరాంజనేయులు, లక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

ఎన్నికల అధికారి రవీందర్

పర్చూరు, ఏప్రిల్ 15 : ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించేలా అధికారులు సిద్ధంకావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గంధం రవీందర్ సూచించారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరిగిన పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఇస్తున్న శిక్షణను ఆర్వో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటింగ్ జరిగే ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు కావలసిన సామగ్రి వినియోగం తదితర అంశాలపై చర్చించారు. 295 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు స్ట్రాంగ్ రూంలకు చేరుకున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలతో ఈవీఎంలు మొరాయిస్తే పోలింగ్ ఆగకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం తహసీల్దార్లు సీహెచ్ సుబ్బయ్య, కే సంధ్యశ్రీ, మెహర్‌బాబు, వైనాగరాజు, ప్రమీల, ఫణీంద్ర కుమార్, పీవోలు, ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో రవీందర్